క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సైదాపురం: తురిమెర్ల గ్రామంలో బుధవారం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం వారితో పాటు 104 సిబ్బంది ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ చైతన్య, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, సిబ్బంది వెంకమ్మ, కమల పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న 4 వలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ దరఖాస్తుల పరిశీలన, 15న మౌఖిక పరీక్షతోపాటు అదేరోజు నియామక పత్రం అందజేస్తారని పేర్కొన్నారు. వివరాలకు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

వెంకటగిరి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ స్కిల్‌హబ్‌లో ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్ సొల్యూషన్స్), అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్స్‌పల్ ఎస్ ఉషారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 70135 09543, 94914 58910 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

విద్యుత్‌శాఖ ఏడీగా వరప్రసాద్‌రెడ్డి



కోట: విద్యుత్‌శాఖ విద్యానగర్ సబ్‌డివిజన్ ఏడీగా వరప్రసాద్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏడీగా ఉన్న దామోదర్ తిరుపతికి బదిలీ కాగా నెల్లూరు నుంచి వరప్రసాద్‌రెడ్డి విద్యానగర్‌కు బదిలీపై వచ్చారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఏఈలు, విద్యుత్ సిబ్బంది ఏడీ వరప్రసాద్‌రావును కలిసి అభినందనలు తెలిపారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ


నాగబాబు ఎస్‌ఐ

సైదాపురం: సైదాపురం ఎస్‌ఐగా పి.నాగబాబు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు జిల్లాలో చిన్నగంజాం పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై సైదాపురం వచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎన్‌ఎంయూఏ నూతన కమిటీ ఎంపిక


ఎన్‌ఎంయూఏ నూతన కార్యవర్గ సభ్యులు

వెంకటగిరి: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వెంకటగిరి డిపో నూతన కమిటీ ఎంపిక ఉమ్మడి జోనల్ ఆ యూనియన్ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎల్‌కేఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. డిపో కమిటీ నూతన అధ్యక్షుడిగా వీపీ రావు, కార్యదర్శిగా కేవీ రత్నం, గ్యారేజ్ ప్రెసిడెంట్‌గా ఏఎం రాజా, గ్యారేజ్ సెక్రటరీ కేఎల్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా రీజనల్ అధ్యక్షుడు ఎస్‌జే పెరుమాళ్, రీజనల్ కార్యదర్శి బీఎస్ బాబురావు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి


గూడూరుకు చేరుకున్న రథయాత్రలో మాట్లాడుతున్న నాయకులు

గూడూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని లక్ష్య సాధన రథయాత్ర అధ్యక్షుడు జె.పరశురాం పేర్కొన్నారు. కరెన్సీపై రాజ్యాంగ సృష్టికర్త ఫొటో ముద్రించాలంటూ గత ఐదేళ్లగా దేశ వ్యాప్తంగా తిరుగుతున్న రథయాత్ర బుధవారం గూడూరుకు చేరుకుంది. ఈ మేరకు స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్వీ సుబ్బయ్య, డి. కృష్ణ, వి.విజయ్‌కుమార్, గోవిందనాయక్, ఏ పార్వతయ్య, కే వెంకటేష పాల్గొన్నారు.

కండలేరులో 48.004 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం 49.070 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 30, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 70, హైలెవల్ స్లూయిజ్‌కు 180 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

• సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పెళ్లకూరు: ప్రజా సంకల్పయాత్రలో ప్రజల కష్టాలు తెలుసుకున్న జగనన్న ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చడంతో, 2024 ఎన్నికల్లో జగనన్నని మళ్లీ గెలిపించుకుని అభివృద్ధి–సంక్షేమాన్ని కొనసాగించుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం పెళ్లకూరులోని చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. జగనన్న పాలనలో పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ పథకాలు అందించడానికి నిదర్శనం టీడీపీ మాజీ ప్రజాప్రతినిధులకు అందిన సంక్షేమ ఫలాలేనన్నారు. గతంలో చంద్రబాబు నీరు–చెట్టు పేరుతో నిధులు బొక్కేశారని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను అడ్డంగా దోచేశారని విమర్శించారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రతో టీడీపీ పూర్తిగా భూస్థాపితం అయ్యిందన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ రఘునాయుడు, నేతలు చైతన్యకృష్ణారెడ్డి, మధుసూదన్‌నాయుడు, వినోద్‌కుమార్ రెడ్డి, మోహన్, చంద్రయ్యనాయుడు, వీరకుమార్, అశోక్, చెంగయ్య, జితేంద్ర వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి జగన్


ఎమ్మెల్యే వరప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న నెల్లూరుపల్లి కొత్తపాళెం దళితులు

• ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: జగన్ రైతుల పక్షపాతని, ఎస్సీ, ఎస్టీలు సాగు చేసుకుంటున్న భూములను, ప్రభుత్వం ద్వారా వారికే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసుకుంటున్న భూముల విషయమై బుధవారం ఆయన ఇరిగేషన్ ఈఈ సురేష్, డీఈ చంద్రశేఖర్, ఏఈ సురేష్‌తో కలిసి, ఈ విషయమై చర్చించారు. అనంతరం ఆ గ్రామానికి చెందిన వారు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యేకు తమ సమస్యను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతన్నారు. వారంతా సెంటు భూమిలేని నిరుపేదలని, ఈ మేరకు ఆ భూములను వారికే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినా కూడా, సాగు చేసుకునేందుకు భూములు లేనివారే ఇలా, కొంత మేర ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వారు సాగు చేసుకుంటున్న భూములపై, ఇప్పటివరకూ ఎవరూ ఇబ్బంది పడుతున్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఇబ్బంది ఉంటే సంబంధిత అధికారులతోపాటు, ఆర్డీఓకు కూడా ఫిర్యాదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అనంతరం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన ఎస్సీ,ఎస్టీ, బీసీలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.

శాశ్వత ముఖ్యమంత్రి జగన్ కావాలి

వాకాడు: రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడు సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. బుధవారం వాకాడు ఏఎంసీ కార్యాలయ ఆవరణలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను, మహిళలను, అన్ని వర్గాల ప్రజలను నమ్మకద్రోహం చేసిన చంద్రబాబును రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. ప్రజాభివృద్ధి కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వాకాడు సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగభూషణమ్మ, నేతలు అజిత్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మధురెడ్డి, వెంకటరత్నం, కృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

భూముల పరిశీలన


భూమిని పరిశీలిస్తున్న జేసీ రోణంకి

సైదాపురం: మండలంలోని చాగణం రాజుపాళెం, జోగిపల్లి, ఊటుకూరు గ్రామాల్లో జేసీ రోణంకి కూర్మనాథ్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. చాగణం రాజుపాళెంలో ప్రభుత్వ భూమి కొనుగోలు కోసం దరఖాస్తు చేసుకున్న భూమిని జేసీ స్వయంగా పరిశీలించారు. అనంతరం జోటిపల్లిలో జేసీ కోర్టులో జరుగుతున్న భూవివాదాలకు సంబంధించి భూములను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఊటుకూరు గ్రామంలో కూడా భూములను పరిశీలించారు. రీసర్వేను కూడా వెంటనే పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. తహసీల్దార్ విజయలక్ష్మి, రీసర్వే డీటీ ప్రసాద్, సర్వేయర్ హజరత్తయ్య పాల్గొన్నారు.

12న నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి ఆదివారం చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఆరోజు స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 5గంటలకు అభిషేకం, మూలమూర్తికి చందనంతో అలంకరిస్తారని, 9గంటలకు శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ వాహనంపై శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహిస్తారని తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి


విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేస్తున్న హరికష్ణ

రాపూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అమోస్‌బాబు కోరారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన కేంద్రాల వద్ద 14వ తేదీ వరకు ఆధార్‌సేవలు అందిస్తారని, వేలిముద్రలు పడని వారు, విద్యార్థులు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ హరికృష్ణ, మహిళా పోలీస్ ఆరీఫా పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి


కమిషనర్ సాయినాథ్

గూడూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పదిహేనేళ్ల వయస్సు పైబడిన వారంతా తమ ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అన్ని జూనియర్ కళాశాలల్లోనూ ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు సచివాలయ సిబ్బందితో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ మేరకు ఆయా కళాశాలల యాజమాన్యాలు వారి విద్యార్థుల, ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కళాశాలల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యాక సచివాలయాల్లోనూ ఈ ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణలపై విచారణ


విచారణ చేస్తున్న అధికారులు

పెళ్లకూరు: మండలంలోని అనకవోలు గ్రామంలో ఆక్రమణలపై బుధవారం డీఎల్‌పీఓ వెంకటరమణ విచారణ చేశారు. కొంతమంది గ్రామస్తులు వీధి స్థలాలను, గ్రామ నత్తం భూమిని ఆక్రమించడంపై ఇటీవల సర్పంచ్ చెంచురామయ్య జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు గ్రామానికి చేరుకొని ఆక్రమణ స్థలాలను పరిశీలించి త్వరలో పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నిజమైన ప్రజాస్వామ్యం


విగ్రహాల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: రాజ్యాంగబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనుగోలు చేసిన చంద్రబాబు అప్రజాస్వామికుడని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే నిజమైన ప్రజాస్వామ్యం నడుస్తోందని ఆయన తెలిపారు. స్థానికంగా పూలే దంపతులు, అబ్దుల్ కలాం, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలు ఏర్పాటవుతున్న ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ద్వారా సీఎం అయిన చంద్రబాబు, ఆ ప్రజాస్వామ్యాన్నే ఖూనీ చేసేలా ఎమ్మెల్యేలను, ఎంపీలను కొనడం నీతిమాలిన చర్యన్నారు. ఈ మేరకు 2019లో ప్రజలు టీడీపీని ఘోరంగా ఓడించారన్నారు. గూడూరుకు ఏమైనా ఒరగబెట్టారా అంటూ ఆయన చంద్రబాబును ఎద్దేవా చేశారు. అదే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక, నేను ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గంలో ఎక్కడాలేని అభివృద్ధితోపాటు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. అలాగే తన సొంత నిధులతో అన్ని సామాజిక వర్గాలకు చెందిన మహనీయుల విగ్రహాల ఏర్పాటు, గూడూరు పట్టణంలో టవర్ క్లాక్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ప్రజాసమస్యలు వెంటనే పరిష్కరించాలి

కోట: ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అధికారులను ఆదేశించారు. కోట తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ కిరణ్‌కుమార్, తహసీల్దార్ పద్మావతితో ఎమ్మెల్యే భూసమస్యలపై సమీక్ష జరిపారు. కోట మండలం వెంకన్నపాళెంలో గర్భకండ్రిగ భూములకు సంబంధించి రైతులు పలు పర్యాయాలు నా దృష్టికి తెచ్చారన్నారు. రెవెన్యూ రికార్డులో పొరపాట్ల కారణంగా భూములు అమ్ముకోలేక పోతున్నామని రైతులు తెలిపారన్నారు. గతంలోనూ ఇదే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, మధుసూదన్‌రెడ్డి, గురుస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు


వేలం పాట నిర్వహిస్తున్న రవికుమార్

గూడూరు: మద్యం, నిషేధిత మత్తుపదార్థాలను తరలించినా, విక్రయించినా నేరమని, అలాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక రెండవ పట్టణంలోని జానకిరాంపేట ప్రాంతంలోని ఎస్‌ఈబీ కార్యాలయంలో బుధవారం సీజ్ చేసిన మోటార్‌సైకిల్‌కు వేలంపాట నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయించడం, మత్తుపదార్థాలు తరలించడం తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, అలా ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. సీఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా మహా సుదర్శన హోమం

గూడూరు: స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మహా సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ స్వామివారికి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పాఠశాల తనిఖీ


పిల్లలతో మాట్లాడుతున్న ఎంఈఓ మస్తానయ్య

దొరవారిసత్రం: సిద్ధాపురం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ మస్తానయ్య తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ మెనూ ప్రకారం అమలు అవుతోందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఎంఈఓ తనిఖీ చేశారు. హెచ్‌ఎం పోలయ్య ఉన్నారు.

గడ్డి కొరత లేకుండా చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న సురేష్

సైదాపురం: వేసవిలో పశువులకు గడ్డి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పశుసంవర్థక శాఖ సంక్షేమ పథకాల డిప్యూటీ డైరెక్టర్ బీవీ సురేష్ తెలిపారు. సైదాపురంలోని పశువైద్యశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు సంపూర్ణ మిశ్రమ దానా కేజీ రూ.15.60 పైసలకు అందించే దానాను ప్రస్తుతం రైతులకు రాయితీతో కేవలం రూ.5.80పైసలకు అందిస్తున్నామని అన్నారు. అలాగే గడ్డి మిషన్‌ను కూడా రాయితీలపై పాడి రైతులకు అందిస్తామని తెలిపారు. ఆర్బీకేల్లో పాడి రైతులకు వివిధ సంక్షేమ పథకాలను పశుసంవర్థక శాఖ సహాయకుల ద్వారా అందిస్తామని చెప్పారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి బొడ్డుప్రసాద్, సిబ్బంది మురళి పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ


కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సీఐ శేఖర్‌రెడ్డి

సూళ్లూరుపేట: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ తనిఖీలను చేశారు. అయితే గతంలో ఆస్పత్రిలో స్టాఫ్ తక్కువగా వుండేవారని, ఇప్పుడు సరిపడా సిబ్బంది ఉన్నారని, రికార్డుల నిర్వహణ తీరు బాగుందని సీఐ కేఆర్ శేఖర్‌రెడ్డి అన్నారు. అలాగే సర్జరీలు కూడా చాలా ఎక్కువగానే జరుగుతున్నాయని చెప్పారు. అయితే పాతభవనాలు, ఓవర్‌హెడ్ ట్యాంకు లేకపోవడంతో కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఆస్పత్రి నిర్వహణ తీరు బాగుందని తెలిపారు. పాత భవనాలు ఉన్నప్పటికీ పక్కనే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లతో భవనాలను నిర్మిస్తున్నారని, ఇవి అందుబాటులోకి రావడమే తరువాయి భవనాల కొరత కూడా తీరుతుందని పేర్కొన్నారు. ఇక్కడ పనితీరు బాగుందన్న విషయాన్ని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. తాగునీటి సమస్యను తీర్చేందుకు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య కూడా తీరుతందుని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి పంపించే నివేదికలో పేర్కొంటామని చెప్పారు. తనిఖీల్లో డీసీటీఓ చెన్నారెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్మికంపోస్టు ఎరువులపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న గోవిందరాజులు

వెంకటగిరిరూరల్: స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం రైతులకు వర్మికంపోస్టు ఎరువుల తయారీపై మండలంలోని ముద్దంపల్లి, టీబీ కండ్రిగ గ్రామాల రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ గృహవ్యర్థాలు, వానపాముల ద్వారా ఎరువులు కుళ్లించిన వ్యర్థాలనుంచి సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చన్నారు. ఈ ఎరువులను వినియోగిస్తే నాణ్యమైన పంటలతోపాటు, అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. అనంతరం మహిళా రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు ఐ.రాజీవన, డాక్టర్ విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి పాల్గన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆదరిస్తే మరింత అభివృద్ధి

• ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


రామారెడ్డికండ్రిగలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట: కల్లబొల్లి మాటలు చెప్పే చంద్రబాబు నాయుడు మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆదరిస్తే మరింత అభివృద్ధి చేసి చూపెడతామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పూడేరు పంచాయతీ రామారెడ్డికండ్రిగలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే టీడీపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు ప్రశాంతంగా లేరన్నారు. అభివృద్ధి కుంటుపడడంతో ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని తెలిపారు. మళ్లీ ప్రజలు వైఎస్సార్‌సీపీని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిస్తే మరింత అభివృద్ధిని తీసుకొస్తామన్నారు. సంక్షేమం వైపు అడుగులు వేసిన ముఖ్యమంత్రి అభివృద్ధిని కూడా రెండు కళ్లుగా ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ మళ్లీ మాయమాటలు చెప్పేందుకు ప్రజల్లోకి వస్తున్నారన్నారు. లోకేష్ పాదయాత్ర వెలవెలపోతోందన్నారు. ప్రజాదరణ కోల్పోయిన నాయకులుగా చరిత్రలో మిగిలిపోయారని అన్నారు. టీడీపీ నేతల ఊసే లేకుండా పోయిందన్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చే పరిస్థితిలో లేరని తెలిపారు. ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి సర్పంచ్ శాంతమ్మ, బాలు, ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీఓ షీలుబాను పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అభివృద్ధికి కృషిచేద్దాం..

నాయుడుపేట మండల వ్యవసాయ మార్కెటింగ్ కమిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తమ వంతుగా కృషిచేద్దామని ఎమ్మెల్యే కిలివేటి అన్నారు. నాయుడుపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పలు అంశాలపై చర్చించి రైతులకు తోడ్పాటు నిచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని గుర్తు చేశారు. అనంతరం ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన దుకాణ యజమానులను పరామర్శించారు.

దోమల నివారణకు చర్యలు


స్వర్ణముఖి నది వద్ద విన్నమాలకాలువకు వదులుతున్న నీరు

నాయుడుపేట: మున్సిపాలిటీలో దోమల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణ పరిధిలోని టీడీ కాలనీ వద్ద స్వర్ణముఖి నది నుంచి విన్నమాల కాలువకు నీటి విడుదల కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ స్వర్ణముఖి నదిలోని నీటిని కాలువకు వదిలి పెట్టడం కాలువలో మురుగునీరు దిగువ భాగానికి ప్రవహించడంతో దోమలు నివారణకు ఓ మార్గమని చెప్పారు. ఇందులో భాగంగానే ఐదు మోటార్లను ఏర్పాటు చేసి తద్వారా వచ్చే నీటిని వేగంగా ప్రవహించేలా చేస్తే నిల్వ నీరంతా ముందుకు సాగే అవకాశం ఉందన్నారు. క్రిమికీటకాలు, దోమల ఉధృతి తగ్గి పట్టణంలో దోమల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. దోమల నివారణకు తక్షణ చర్యలు చేపడుతూ ఎప్పటికప్పుడు మురుగుకాలువల్లో మురికి నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటారన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్ కాలగంధ సుమ, పార్టీ నేతలు బైనా మల్లిఖార్జున్ రెడ్డి, పేట చంద్రారెడ్డి, అన్నమేటి చంద్ర, షబ్బీర్, పేర్నాటి రాహుల్, సునీల్ పాల్గొన్నారు.